క్లుప్తంగా

మురళీనాయక్ త్యాగం మరువలేనిది


మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: దేశం కోసం ప్రాణాలు అర్పించిన గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీనాయక్ త్యాగం మరువలేనిదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మురళీనాయక్ దేశం కోసం చేసిన త్యాగం ఎన్నటికీ మరువలేమన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. బాధిత తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలన్నారు. పాకిస్తాన్ దుందుడుకు చర్యను ప్రతి భారతీయుడు దీటుగా ఎదుర్కోవాలన్నారు. వీర జవాన్లకు ప్రతి ఒక్కరూ మద్దతుగా, అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. సరిహద్దులో యుద్ధ వాతావరణం మొదలైందన్నారు. ఎందరో జవాన్లు దేశాన్ని రక్షించేందుకు ప్రాణాలొడ్డుతున్నారన్నారు. వారందరికీ భారతీయులంతా రుణపడి ఉంటారని చెప్పారు.

జెడ్పీటీసీ రాధాస్వామికి పరామర్శ


రాధాస్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ, పార్టీ నాయకులు

కళ్యాణదుర్గం: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామిని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పరామర్శించారు. గురువారం రాత్రి పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్‌తో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రాధాస్వామి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బ్యాంకర్లకు సన్మానం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో కెనరా బ్యాంకు సిబ్బంది బదిలీపై కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు వెళ్తుండడంతో రైతులు, బ్యాంకు సిబ్బంది శుక్రవారం సన్మానించారు. కెనరా బ్యాంకు మేనేజర్ నరేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ ప్రభాకర్ కర్ణాటకలోని రాణిబెన్నూర్, భద్రావతి తమిళనాడులోని మధురై ప్రాంతాలకు బదిలీ కావడంతో సిబ్బంది, రైతులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో కొత్త మేనేజర్ రామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అమరుడా.. నీకు జోహార్లు


కళ్యాణదుర్గంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన గోరంట్ల మండలం కల్లీ తండా మురళీనాయక్‌కు దళిత, గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళీ నాయక్ ఆత్మకు శాంతిచేకూరాలని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో దళిత సంఘాల నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

రాయదుర్గం: జిల్లాలో వెలుగులు నింపిన ఆర్డీటీని కాపాడుకునే బాధ్యత ప్రతిపౌరుడిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసం వద్ద ఆయన మాట్లాడారు. సేవ్-ఆర్డీటీ, సేవ్- అనంత పేరుతో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ సేవలు అందించిందన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ ఆలస్యమైతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గుర్తుకొస్తున్నాయి..

రాయదుర్గం: విద్యా సంవత్సరం పూర్తయ్యింది. ప్రస్తుతం వేసవి కాలం.. ఎండలు మండుతున్నాయి. పిల్లలంతా ఆటపాటల్లో గడిపేందుకు ఆసక్తి చూపిస్తారు.. చాలా మంది పట్టణాలు, నగరాల నుంచి పల్లెటూళ్లకు, అమ్మమ్మ, నాన్నమ్మ ఊళ్లకు వెళ్లాలనుకుంటుంటారు.. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టిన చిట్టిబుర్రలు (పిల్లలు).. టీవీలు, సెల్‌ఫోన్లతోనే సమయమంతా వృథా చేసుకోకుండా తోటి మిత్రులతో సరదాగా గడపాలనుకుంటారు.. కొత్త విషయాలు, సరికొత్త అనుభూతులు తెలుసుకోవాలనుకుంటారు.. 'విద్యార్థి దశలో వేసవి సెలవులు ఎలా గడిపారు' అనే అంశంపై ఉన్నత స్థానాల్లో స్థిరపడిన అధికారులు, ప్రముఖులు తమ అనుభవాలను 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు.


గోళీలాట ఆడుతున్న బాలురు

సమ్మర్ స్పెషల్

సరదాగా గడిపేవాళ్లం



మా స్వగ్రామం కడప జిల్లా జమ్మలమడుగు. వేసవి సెలవులు వస్తే చాలు.. పిల్లలంతా కలిసి సరదాగా రోజంతా ఆడుకునే వాళ్లం. అన్నమైనా తిందురు రాండ్రా అని ఇంట్లో వాళ్లు బతిమాలినా వెళ్లేవాళ్లం కాదు. ఆటలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాళ్లం. ఎక్కువ భాగం ఉయ్యాల, స్కిప్పింగ్, కాళ్లపై ఇసుక మట్టి కప్పుకొని ఇళ్ల గూళ్లు కట్టడం, బారాకట్ట, దాగుడు మూతలు, సబ్జాఆట.. ఇలా ఎన్నో పొద్దున నిద్ర లేచినప్పటి నుంచి ఆడుకునేవాళ్లం. ఆ రోజులు తలస్తేనే ఏదో తెలియనంతగా ఫీలింగ్ వస్తోంది. ఇక రాత్రి కాగానే అమ్మమ్మ, తాతయ్య వద్ద నిద్రపోయేవాళ్లం. వారు చెప్పే కథలు వింటూ అలా గడిపేసేవాళ్లం.

– మెర్సీ జ్ఞానసుధ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

చిల్లా కట్టె ఆడేవాళ్లం



జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న బుక్కరాయ సముద్రం నా సొంతూరు. నా చిన్న తనంలో టీవీలు, సెల్‌ఫోన్లు ఉండేవి కావు. వేసవి సెలవులు రాగానే అమ్మమ్మ, తాతయ్య ఊరు అయిన రాప్తాడు మండలం వరిమడుగు వెళ్లేవాడిని. సెలవులు పూర్తయ్యే వరకూ అక్కడే ఉంటూ, నా తోటి పిల్లలతో రోజంతా చిల్లా కట్టె, గోలీలు, హాకీ, కబడ్డీ, కళ్లు మూసే ఆటలు ఎక్కువగా ఆడేటోళ్లం. మధ్యాహ్నం 12 దాటిందంటే చాలు.. సమీప చెరువులు, నీటి కుంటల్లో ఈత కొడుతూ సేదదీరేవాళ్లం. కనీసం అన్నమైనా తిని వెళ్లమని ఇంట్లోవాళ్లు బతిమాలుతుండేవారు. చింతకాయలు కోసుకునేవాళ్లం. ఉప్పు, బెల్లం చింతపండు ఎక్కువగా తినేటోళ్లం. లేదంటే జేబు నిండా ముండోడ్ల బెల్లం ఉంటలు వెంట తీసుకెళ్లి పిల్లలంతా కలసి తినే వాళ్లం. లాంతరు వెలుగుల్లో నేలపై నిద్రించే వాళ్లం. ఊర్లో ఎప్పుడైనా బట్ట సినిమాలు వేస్తే ఆరోజంతా మాకు పండుగే. బైలు నాటకాలు, పౌరాణిక కథల ప్రదర్శన ఉందని తెలిస్తే చాలు.. వారి వద్దే ఉంటూ పరదాలు కట్టడం, నీళ్లు తెచ్చివ్వడం, మైకుసెట్ తీసుకొని పిల్లల్ని వెంటేసుకుని వీధుల్లో ప్రచారం చేసేవాళ్లం. ఇప్పటి పిల్లలకు అప్పటి ఆటలు ఏంటో తెలియవు. చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు.. ఇంట్లోవాళ్లను, తల్లిదండ్రులను కూడా మరిచిపోయి కాలం గడిపేస్తున్నారు.

– వెంకటరాముడు, డిప్యూటీ తహసీల్దార్, రాయదుర్గం



ఈతకే ప్రాధాన్యత



మాది మడకశిర తాలూక గుండుమల గ్రామం. వేసవి సెలవులు వస్తే చాలు ..ఓ పది మంది స్నేహితులు అందరం కలిసి రోజంతా అలసిపోయేలా మామిడి, నేరేడు, పత్తి పండ్ల కోసం అడవుల్లోకి వెళ్లే వాళ్లం. మధ్యాహ్నమైతే చాలు.. కుంటలు, బావుల్లో ఈతకెళ్లి సరదాగా గడిపేవాళ్లం. నీరున్న బావుల్లో పోటాపోటీగా పై నుంచి దూకుతూ సరదాగా సేదతీరేవాళ్లం. అలాగే కబడ్డీ, దాగుడు మూతలు, దాక్కునే ఆటలు, చిల్లా కట్టి, గోళీలాట, కబడ్డీ, బారాకట్ట ఆటలు ఆడేవాళ్లం. చిన్నప్పుడు ఆడిన ఆటలు ఇప్పటికీ మధురానుభూతులుగానే మిగిలిపోయాయి. నేటికీ కళ్లముందు మెదులుతూనే ఉంటాయి.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

పాత రోజులు మళ్లీ వస్తే బాగుండు



శెట్టూరు: వేసవికాలం వస్తే చాలు.. నా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొసాయి. ఏ వయస్సులో ఉన్నా నాటి జ్ఞాపకాలు నేటికీ మధురానుభూతి. ఉదయం లేవగానే పశువుల పాక నుంచి మా పశువులను పొలంలోని చెట్టు కిందకు తీసుకెళ్లి కట్టి ఉంచేవాళం. చింత చిగురుకోసం చింత చెట్టు ఎక్కేవాడిని. చిగురుపప్పు, నెయ్యి అన్నం తింటే మధురంగా ఉండేది. ఇక స్నేహితుల వద్దకు వెళ్లి చిల్లాకట్టి ఆటాడుతూ పరుగులు పెట్టావాళ్లం. గోళీలతో మా జేబులు నిండి ఉండేవి. ఎండలో ఆటలు ఆడి అలసిపోయిన మేము.. అటు నుంచి అటే ఈత కోసం స్నేహితులతో కలిసి బావులకు వెళ్లేవాళ్లం. గంటల తరబడి నీళ్లలోనే ఉంటూ ఈతలో స్నేహితులతో పోటీ పడేవారం. ఈతరాని వారు మునగ కట్టెలు (నుగ్గబడ్లు) నడుముకు కట్టి ఈత కొట్టేవారు. చీకటి పడితేచాలు స్నేహితులంతా కలిసి ఒక రోజు ఉప్పరం పట్టి ఆట, మరో రోజు కబ్బడీ ఆటలు అడేవారం. ఈ రోజుల్లో స్నేహితులు ఉన్న సాయంత్రం అయితేనే టీవీ సీరియల్స్, అందరూ ఒకే చోట చేరి, ఎవరితో వేమీ మాట్లాడకుండా ఆటలు ఆడకుండా ఒక్కచోట కూర్చొని సెల్‌ఫోన్ పట్టుకొని ఎవరికి వారుగా చూస్తుండి పోతున్నారు. మా చిన్ననాటి రోజుల్లో కల్మషం లేని మనస్సుతో కలిసి ఆడుకునేవారం. ఆరోగ్యంగా, దృఢంగా ఉండేవారం. ఆరోజులే వేరు.. మళ్లీ పాతరోజులు వస్తే బాగుంటుంది.

– జీవన్ గోపాల్ రెడ్డి, రైతు, శెట్టూరు గ్రామం

క్రికెట్ కోసం రోజుకో ఊరికి..



మాది రాయచోటి ప్రాంతంలోని బోయపల్లి గ్రామం. క్రికెట్ అంటే నాకు ఇష్టం. మా ఊరి స్కూల్ మైదానంలో రోజంతా బ్యాట్, బాల్‌తో ప్రాక్టీస్ చేసేవాడిని. నాతోపాటు సుమారు పదుల సంఖ్యలో పిల్లలు ఈ ఆటకే మొగ్గుచూపేవారు. సచిన్ టీమ్‌గా మాటీమ్‌కు పేరుండేది. వేసవి సెలవుల్లో చుట్టుపక్కల గ్రామాల్లో టోర్నీలు నిర్వహిస్తే.. అందులో పాల్గొనేవాళ్లం. మ్యాచ్ గెలవాలనే తపనతో భోజనంపై కూడా ధ్యాస ఉండేదికాదు. సైకిళ్లు, కాలినడకతో వెళ్లి మ్యాచ్‌లు ఆడిన సందర్భాలు అధికం. ఈత, చిల్లాకట్టి, గోళీలు, ఖోఖో ఆడేవాళ్లం. ఈ తరం పిల్లలు కూడా పాత ఆటలు గుర్తుపెట్టుకుంటే బాగుంటుంది.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

శుభకార్యం


యూత్ అధ్యక్షులు కె.తేజ వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే మెట్టుగోవిందరెడ్డి తదితరులు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.గురుమూర్తి కుమారుడు, కణేకల్లు మండల వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు కె.తేజ వివాహం స్వాతికతో స్థానిక కేసీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాలులో శుక్రవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, రాయదుర్గం నియోజకవర్గ సమన్వకర్త మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డిలు నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి హళ్లి నాగరాజు, వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, రాయదుర్గం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షులు ఉషారాణీ, వాణిజ్య విభాగం అధ్యక్షులు ఆర్కే బద్రీ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, మాజీ కన్వీనర్ చిక్కణ్ణ, మాజీ సర్పంచు కురుబ లోకేష్‌గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు కురుబ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నేతలు వేమన, కృష్ణారెడ్డి, యంత్రకాయల వండ్రప్ప పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవీ దుర్గేష్ కుమారుడు వంశీ, నవ్య వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం గోవిందవాడలోని శాంతబాయి శ్రీరామ్‌రావు కల్యాణ మంటపంలో వంశీ, నవ్యల వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు లోకేష్, కందేపల్లి రమేష్, కృష్ణ, తిప్పేస్వామి, నాగిరెడ్డి, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, యర్రగుంట కేశవరెడ్డి, ఆంజనేయులు హాజరయ్యారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. శుక్రవారం కోటవీధిలోని 13వ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

సకాలంలో కాలువల్లో పూడికతీయించాలి..: నెలాఖరులోపు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. శుక్రవారం ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో పూడిక తీత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చన్నవీర, వార్డు ఇన్‌చార్జ్‌లు గోల్డ్ ఇస్మాయిల్, భీమనపల్లి దివాకర్, బషీర్ అహ్మద్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం


నీటి సమస్య పరిష్కరించాలని అధికారులతో వాగ్వాదం చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మన్న

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం శుక్రవారం రసాభాసగా జరిగింది. కౌన్సిల్ సమావేశానికి వైస్ చైర్మన్ తిమ్మప్ప అధ్యక్షత వహించారు. అయితే వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్‌తో పాటు, 10 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు లక్ష్మన్న, హేమావతి ఇద్దరు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ముందుగా కౌన్సిలర్ లక్ష్మన్న మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ వ్యాప్తంగా 24 వార్డుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నా పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మిగిలిన కౌన్సిలర్లు కూడా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ, అధికారులు, కౌన్సిలర్లు హాజరయ్యారు.

రేపు ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కళ్యాణదుర్గం రూరల్: తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈనెల 11న జరుగుతున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలి పా రు. పట్టణంలోని జోతిర్మయి బాలికల ప్రైవేట్ కళాశాలలో ఉదయం 10 గంటలకు ఎన్నికలుంటాయ న్నా రు.

ఉచిత ఖత్నాను సద్వినియోగం చేసుకోండి

కణేకల్లు: కణేకల్లులో చిన్న పిల్లలకు ఉచితంగా ఆదివారం నిర్వహిస్తున్న ఖత్నాను పేద ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు డాక్టర్ అరోహీ, షాకీర్ షేక్ గౌస్, పీర్‌బాషాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయదుర్గం: మండలంలోని 132/33 కేవీ 74 ఉడేగోళం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 6:30 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ బాలచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం, గుమ్మఘట్ట మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

12న ఉచిత కంటి వైద్య శిబిరం

డి హీరేహాళ్ (రాయదుర్గం): పారిశ్రామికవేత్త ఇబ్రహీం సాహెబ్ జయంతి సందర్భంగా ఈ నెల 12న డి హీరేహాళ్ లోని ఆయన స్వగృహంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగాడి జగదీష్ తెలిపారు. ఇబ్రహీంసాహెబ్ ఫౌండేషన్ అధ్యక్షుడు దాదాఖలందర్, బళ్లారి పట్టణానికి చెందిన డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సంక్షిప్త సమాచారం

నోటిఫికేషన్ విడుదల

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి, స్వయంభూ జంబుకేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ, ధర్మదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఈఓ నరసింహా రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లోపు జిల్లా అధికారి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

జేఎల్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

వజ్రకరూర్: మండలంలోని పందికుంట జేఎల్‌ఎం దివాకర్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఉమామహేశ్వరి శుక్రవారం కోరారు.ఆమె మాట్లాడుతూ పందికుంట తండాలో వారం రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా ఆ స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారన్నారు. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో పంచాయతీ మోటార్ పనిచేయక తండాలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా జేఎల్‌ఎం ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వడంతో పాటు జేఎల్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కజొన్న పంట దగ్ధం

కణేకల్లు: యర్రగుంటలో శుక్రవారం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో హనుమక్క అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట కాలిపోయింది. మూడెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు నిప్పంటుకున్నట్లు బాధితురాలు తెలిపింది. పంట సాగు కోసం రూ.90వేలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపింది. పంట కోతకు వచ్చినసమయంలో కాలిపోవడంతో నష్టపోయినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే గ్రామంలో బోయ వండ్రప్పకు చెందిన వరిగడ్డివామి మంటల్లో కాలిపోయింది. సమీపంలో వెల్డింగ్ పనులు జరుగుతుండగా, నిప్పురవ్వలు ఎగిసిపడి వరిగడ్డివామిపై పడినట్లు స్థానికులు తెలిపారు.

హై-రిస్క్ గర్భిణులపై నిర్లక్ష్యం సరికాదు

కూడేరు: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రసవ సమయంలో మాతా శిశువులకు ప్రాణాపాయం ఉండే అవకాశం ఉందని వైద్యాధికారిణి ఉషారాణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా హై-రిస్క్ గర్భిణులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారిణి ఉషారాణి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారందరికీ మందులు అందించారు. ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరోజ, సూపర్‌వైజర్ యశోద, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి నరసింహ జయంతి


నరసింహస్వామి ఆకారంలో వెలసిన వేపచెట్టు

కళ్యాణదుర్గం: కల్యాణదుర్గం కోటలోని ఓ వేపచెట్టులో కొలువైన నారసింహస్వామి జయంతి వేడుకలు శనివారం నుంచి జరగనున్నాయి. కల్యాణదుర్గం కోటలోని ఓ వేపచెట్టులో కొలువైన నారసింహస్వామి జయంతి వేడుకలు శనివారం నుంచి జరగనున్నాయి. నరసింహస్వామి జయంతి సందర్భంగా రెండురోజుల పాటు వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 11న ఉదయం కోటలోని నృసింహాలయంలో శేష వాహన సేవలు అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణోత్సవం జరుగుతాయి. మధ్యాహ్నం తీర్థ ప్రసాద వినియోగం, అన్న సంతర్పణ ఉంటుంది. సోమవారం స్వామివారి మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాల అభిషేకం, నివేదన, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు వైభవంగా గ్రామోత్సవం ఉంటుంది. రాత్రి 7 గంటలకు ఉయ్యాలోత్సవం జరుగుతుందని ఆలయ ప్రతినిధులు జీఎల్ఎన్ శర్మ, గుంటి రమేష్, ప్రతాప్ తదితరులు తెలిపారు.

ప్లాస్టిక్ మేత..ప్రమాదం చెంత


చెత్తకుప్పలో ప్లాస్టిక్ తింటున్న పశువులు

రాయదుర్గం: దశాబ్దాల క్రితం లాగా గ్రాసం దొరకడం గగనమైంది. పాడి పోషణ భారమైంది. పచ్చిగడ్డి తినాల్సిన పశువులు చెత్తకుప్పల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలతో పూట గడుపుకోవాల్సి వస్తోంది. పల్లెల్లో అయితే పశువులను అడవికి తీసుకెళ్తారు. పట్టణాల్లో పశువులను వీధుల్లోకి వదులుతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు, హోటళ్ల యజమానులు, దుకాణదారులు పరిశుభ్రత పాటించడంలేదు. ఇళ్లవద్దకు వచ్చే ఆటోలు, డస్ట్‌బిన్లలో వ్యర్థాలను వేయడం మర్చిపోయారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీంతో మూగజీవాలకు ముప్పువాటిల్లుతోంది. కణేకల్లు రోడ్డు, బళ్లారిరోడ్డు, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్, మొలకాల్మూరురోడ్డు, అనంతపురం ప్రధాన రహదారి, మార్కెట్ ఏరియాలో నిత్యం పశువులు సంచరిస్తూ ప్లాస్టిక్ వ్యార్థాలు తింటున్నాయి. పాలు పిండుకుని రోడ్డుకు వదిలేయడమే తమ బాధ్యత అన్నట్టు యజమానులు వ్యవహరిస్తున్నారు. మూగజీవాలు వ్యర్థాలను తిని మృత్యువాత పడుతున్నాయి.

ప్రవేశ ద్వారం.. పక్కనే ప్రమాదం

రాయదుర్గంటౌన్: ప్రధాన రహదారి.. అందునా ప్రభుత్వ విద్యా సంస్థల ప్రవేశ ద్వారం.. అటుఇటు ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. పక్కనే మృత్యు ఘంటికలు ఉన్నట్లు ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజు బాక్సు ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల కళాశాల ప్రవేశ ద్వారం వద్ద కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ముళ్లకంపలు పేరుకుపోయి పాఠశాల ప్రవేశ ద్వారానికి ఆనుకొని ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజు బాక్స్

బాల్యవివాహాలను అడ్డుకోవాలి


ఛాయాపురంలో కిశోరి వికాసం పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

వజ్రకరూర్: బాల్యవివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. శుక్రవారం వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్లలో 5, 9 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఛాయాపురంలో కూడా కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో సీడీపీఓ శ్రీదేవి పాల్గొని బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, దుష్పరిణామాలు వివరించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పద్మావతి, హెచ్. పద్మ, కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత అన్నారు. శుక్రవారం కొలగానహళ్లిలో బాల్య వివాహాలు, ఆరోగ్య అవగాహన తదితర కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎక్కువగా మాతృ, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. రక్తహీనత, పోషకాహార లోపాలతో అనర్థాలు జరుగుతాయన్నారు.